మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సోమవారం మర్యాక్ మండలం ఎర్రవల్లి నివాసంలో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ చరిత్రకు సంబంధించిన ఫొటో ఆల్బమ్‌ను కేసీఆర్‌కు అందజేశారు.

కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తప్పదు

సీఎం రేవంత్‌కు రైతు గోడు పట్టదు

- సర్కార్‌కు జల విధానం అసలే లేదు
- ఢిల్లీ టూర్లతో కాలం వెళ్ల దీస్తున్న సీఎం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- పెద్దగట్టు లింగమంతులస్వామికి బోనం

సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, మల్లయ్యయాదవ్, భూపాల్‌రెడ్డి

సూర్యాపేట, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): 'సమాజానికి అన్నం పెట్టే రైతుల గోడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అస్సలే పట్టదు. ప్రభుత్వానికి దేనిపైనా ఆలోచన లేదు. ప్రధానంగా జల విధానంపై స్పష్టత లేదు. ఈ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగలడం ఖాయం' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీ పర్యటనలు చేయడంతోనే సీఎం రేవంత్‌రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా పెద్దగట్టు లింగమంతులస్వామి జాతరకు ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు. బోనం ఎత్తుకొని గుట్టపైకి ఎక్కి స్వామివారికి పూజలు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 14 నెలల పాలనలో 30సార్లు ఢిల్లీకి పోవడం, కాంగ్రెస్ పెద్దల కాళ్లు పట్టుకోవడం, మళ్లీ గల్లీ కొచ్చి కేసీఆర్‌ను తిట్టడం ఇలాగే నడుస్తున్నది గానీ ముఖ్యమంత్రికి ఒక స్పష్టమైన ఆలోచన లేదని దుయ్యబట్టారు. గురుకులాల్లో చనిపోతున్న పిల్లల పట్ల, ఉద్యోగాల నోటిఫికేషన్లపై రేవంత్‌రెడ్డి రివ్యూ చేయకపోవడం దౌర్భాగ్యమని మండిపడ్డారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఒక్క కార్యక్రమం కూడా ఈ 14 నెలల్లో చేయలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, విద్యార్థినులు, యువతులకు స్కూటీలు ఇచ్చారా? అని నిలదీశారు. మహిళలకు ఏం చేశారో ప్రభుత్వ పెద్దలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేసీఆర్ పాలనలో ఏది చేసినా మహిళల పేర చేశామని, డబుల్ బెడ్రూం ఇండ్లు, పింఛన్లు, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి ఏదైనా సరే ముందు ఆడబిడ్డలను పెట్టుకుని ఎంతో బాగా చూసుకున్నామని గుర్తుచేశారు. నాడు ఎవరైనా నేరాలు చేయాలంటే వెన్నులో వణుకు పుట్టేలా కేసీఆర్ పరిపాలన అందించారని తెలిపారు. ఈ 14 నెలల్లో 20% క్రైంరేట్ పెరిగిందని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రం ఉట్టిగా రాలేదని, పేగులు తెగేదాకా కొట్లాడితే వచ్చిందని గుర్తుచేశారు. తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోలేకపోతే ఎందుకు అధికారంలో ఉన్నట్టు? ఎవరి కోసం ఉన్నట్టు? మీ ప్రాధాన్యం ఏమిటో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'ఎస్టీల కోసం ఏమైనా చేశారా? ఎస్సీ, బీసీ జనాభాను తక్కువ చేసి చూపిస్తున్నారు. ఎవరి కోసం పని చేస్తున్నారు? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి గోదావరి జలాలను ప్రతి గ్రామంలో పారించిన ఘనత కేసీఆర్‌ది అని తెలిపారు.

ప్రభుత్వానికి జల విధానం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక జల విధానం, ఆలోచన లేదని ఎమెల్సీ కవిత విమర్శించా రు. తెలంగాణకు నీళ్లు మలపాలనే ఒక విధా నం లేని సీఎం రేవంత్.. మేడిగడ్డను వాడకుండా పంటలను ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ 199 టీఎంసీలతో బనకచర్లలో కొత్త ప్రాజెక్టు కడుతామని మోదీతో పైరవీలు చేస్తుంటే, మన సీఎం కనీసం ఇప్పటివరకు నాగార్జునసాగర్‌ను కూడా రాష్ట్ర పరిధిలోకి తేలేదని దు య్యబట్టారు. 'నాగార్జునసాగర్, కాళేశ్వరం నీళ్లు రాకుంటే మన పరిస్థితి ఏమైతది? తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం ఎవరి కోసం? దీనికి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలి. సూ ర్యాపేట జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయంటే ఆ పాపం, ఆ ఉసురు ఉత్తమ్‌కు త గులుతుంది' అని పేర్కొన్నారు. నీళ్లపై శ్రద్ధ లేని ఇరిగేషన్ మంత్రి పదవిలో ఉన్నా ఒక టే, లేకున్నా ఒకటేనని ప్రజలు ఆలోచిస్తున్నారని తెలిపారు. రేవంత్ టీవీలో కనిపిస్తే ప్రజలు చానల్ బంద్ పెట్టే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, రాష్ట్ర నాయకుడు సోమ భరత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గా దరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాద వ్, నోముల భగత్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, చంద్రవతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, దావు ల వీరప్రసాద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, గండూరి కృపాకర్, రంగినేని ఉపేందర్, బాలసైదులు పాల్గొన్నారు.

> ఆడబిడ్డ తెలంగాణలో బాగున్నా.. భద్రంగా ఉన్నా.. అనే చెప్పుకొనే పరిస్థితి ఉన్నదా? నెలకో మతకల్లోలం అవుతున్నది. ఇలాంటి వాటితో ప్రపంచ రికార్డు సాధిద్దామని అనుకుంటున్నారా?
>
> –ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరలో చౌడమ్మకు బోనం తీసుకొస్తున్న ఎమ్మెల్సీ కవిత

పెద్దగట్టు జన సంద్రం

- స్వామివారిని దర్శించుకున్న 5 లక్షల మంది భక్తులు
- గుడి ఎదుట చంద్రపట్నం వేసిన యాదవ పూజారులు

సూర్యాపేట, ఫిబ్రవరి 18(నమస్తేతెలంగాణ) : రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతర అయిన సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర మూడో రోజూ జన సంద్రంగా కనిపించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు దాదాపు 5 లక్షల మంది స్వామిని దర్శించుకున్నారు. యాదవ పూజారులు గుడి ముందు చంద్రపట్నం వేసి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బోనమెత్తుకుని మెట్ల మీదుగా ఆలయానికి చేరుకున్నారు. చౌడమ్మకు బోనం సమర్పించి, లింగమంతుల స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్‌కుమార్, చంద్రవతి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూదిమెట్ల బాలరాజుయాదవ్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

లింగమంతుల స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

రీసర్వేపై ప్రచారంలో సర్కార్ విఫలం

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా కులగణన రీ సర్వేపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. అందుకే తొలిరోజైన మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కేవలం 43 మంది నుంచే అభ్యర్థనలు వచ్చాయని ఎక్స్ వేదికగా గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలను సంఘటితం చేయడంలో మళ్లీ విఫలమైందనడానికి ఇదో స్పష్టమైన ఉదాహరణ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు రీ సర్వేను సీరియస్‌గా తీసుకుంటే ఫలితం ఎందుకు కనిపించడం లేదు? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలోనే సూర్యాపేట జిల్లాలోని పెద్దగట్టు లింగమంతుల స్వామి ఆలయానికి ప్రాచుర్యం దక్కిందని కవిత ఎక్స్ వేదికగా మరో పోస్టులో పేర్కొన్నారు. 2008లో పెద్దగట్టు ఆలయాన్ని తొలిసారి సందర్శించానని, ఆనాటి ఫొటోను పోస్టుచేశారు. మంగళవారం మరొకసారి పెద్దగట్టు జాతరకు హాజరవుతుండటం సంతోషంగా ఉన్నదని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి కేసీఆర్ విరివిగా నిధులు మంజూరు చేశారని, పాత గుడి స్థానంలో కొత్త గుడిని నిర్మించారని తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద గుట్టపై వరకు పైప్‌లైన్ ఏర్పాటుచేశారని, లక్ష లీటర్ల నీటి సామర్థ్యం గల ట్యాంకును నిర్మించి నీటి సమస్యను శాశ్వతంగా దూరం చేశారు' అని పేర్కొన్నారు.

లోకం పోకడ

మా విధులకు ఆటంకం లేకుండా సహకరించినందుకు థాంక్యూ సార్.. నిజమైన ఫ్రెండ్లీ-గవర్నమెంటు అంటే మీరే!

సిక్కిం క్యాబినెట్ సెక్రటరీ విజయ్‌భూషణ్ పాఠక్‌తో భేటీ అయిన మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సిక్కిం పర్యటనలో మాజీ ఎంపీ వినోద్

- క్యాబినెట్ సెక్రటరీ విజయ్‌భూషణ్‌తో భేటీ
- పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధిని వివరించిన మాజీ ఎంపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సిక్కిం రాష్ట్ర పర్యటనకు వెళ్లారు. నాలుగు రోజుల వ్యక్తిగత పర్యటనకు వెళ్లిన ఆయన.. మంగళవారం సిక్కిం రాష్ట్ర క్యాబినెట్ సెక్రటరీ విజయ్‌భూషణ్ పాఠక్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ, సిక్కిం రాష్ట్రాల అభివృద్ధి, వ్యవసాయం, జీఎస్డీపీ, జీడీపీ, పరిశుభ్రతపై చర్చించినట్టు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో సాగిన 14 ఏండ్ల రాష్ట్ర సాధన ఉద్యమం, సీఎంగా కేసీఆర్ పదేండ్లలో చేసిన అభివృద్ధి, వ్యవసాయ ప్రగతి, గోదావరి, కృష్ణా నదులపై నిర్మించిన ప్రాజెక్టులు, పెరిగిన పంటల ఉత్పత్తి గురించి పాఠక్‌కు వివరించినట్టు పేర్కొన్నారు. సిక్కింలో పసుపు, అల్లం, యాలకులు, గోధుమలు, పండ్ల తోటలు సేంద్రియ పద్ధతిలోనే సాగుచేస్తామని పాఠక్ తెలిపినట్టు వెల్లడించారు.

'తెలుగు వైబ్'పై చర్యలు తీసుకోవాలి

ఠాణాలో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): చెల్లని రూపాయి.. చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి.. ఒకటేనని బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారం చేస్తున్న తెలుగు వైబ్ ట్విటర్ (ఎక్స్) హ్యాండిల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలిలోని సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు దాసోజుశ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, అభిలాశ్, కురువ విజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అనంతరం దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. తెలుగు వైబ్ ద్వారా కాంగ్రెస్ బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్, హరీశ్‌రావు మధ్య విభేదాలు ఉన్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ క్యాడర్ మనోధైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న తెలుగువైబ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, దీని వెనుక ఉన్నవారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకభూమిక పోషించిన హరీశ్‌రావు ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ కుతంత్రాలకు దిగిందని మండిపడ్డారు. నిరుడు కాంగ్రెస్ సోషల్‌మీడియాపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆక్షేపించారు. ఇప్పటికైనా చట్టప్రకారం వ్యహరించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ కమిషన్ కాలపరిమితి పెంపు

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ కమిషన్ కాల పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం నెలరోజులు పొడిగించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 10తో జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ గడువు ముగియగా, మార్చి 10 వరకు పొడిగించినట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు.

కొత్త టీచర్లకు శిక్షణ

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త టీచర్లకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వనున్నది. ఇందుకోసం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ల (డీఆర్‌పీ)కు హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. డీఆర్‌పీ ఎంపిక బాధ్యతను జిల్లాల డీఈవోలకు అప్పగించారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 4 వరకు విభాగాల వారీగా శిక్షణ ఇవ్వనున్నారు. ఆ తర్వాత డీఆర్‌పీలు ఆయా జిల్లాల్లో టీచర్లకు శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు.

బిల్లుల భారం.. మాజీ సర్పంచ్‌లకు శాపం

- సర్కారుకు మొరపెట్టుకున్నా దక్కని ఫలితం
- మనోవేదనతో మృత్యువుకు చేరువవుతున్న మాజీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బిల్లుల భారం మాజీ సర్పంచ్‌లకు శాపంగా మారుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా వేల మంది మాజీ ప్రజాప్రతినిధులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. సర్కారుకు అనేకసార్లు మొరపెట్టుకున్నా, శాంతియుతంగా నిరసనలు తెలిపినా కనికరించడంలేదు. దీంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు హఠన్మారణానికి గురి కాగా, మరికొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

నెరవేరని హామీలు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి రాగానే 691 కోట్ల పెండింగ్ బిల్లులు ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ గద్దెనెక్కి పద్నాలుగు నెలలు దాటినా ఆ ఊసెత్తడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు సైతం ఈ విషయాన్ని దాటవేస్తున్నారు. ప్రతిపక్షాలు ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నించినా త్వరలోనే చెల్లిస్తామని చెప్పింది. కేవలం కేంద్రం అందించే ఉపాధి హామీ బిల్లులు చెల్లించి చేతులు దులుపుకున్నది. కానీ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నుంచి నయాపైసాకూడా చెల్లించలేదని మాజీ సర్పంచ్‌ల సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.

గాల్లో కలుస్తున్న ప్రాణాలు..

ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల భారం పెరిగి ఇప్పటికే పలువురు మాజీ సర్పంచులు ప్రాణాలు విడిచారు. నిరుడు నవంబర్‌లో నిర్మల్ జిల్లా పెంబి గ్రామ సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్ ఆత్మహత్య చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కడపగండికి చెందిన శంకర్‌నాయక్ అనారోగ్యంతో దవాఖానలో చేరాడు. చికిత్సకు డబ్బు లేకపోవడంతో అక్కడే తనువు చాలించాడు. యాదాద్రి భువనగిరి జిల్లా కుంట్లగూడెం మాజీ సర్పంచ్ మల్యాల గోపాల్ గుండెపోటుకు గురయ్యాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కోళ్లమద్దికి చెందిన ఏనుగుల కేశవరావు పురుగుల మందు తాగేందుకు యత్నించాడు. మూడురోజుల క్రితం వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాశింపూర్‌కు చెందిన దళిత మాజీ సర్పంచ్ వెంకటప్ప పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 14 నెలల్లో సుమారు 25 మందికి పైగా మాజీ సర్పంచులు మరణించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర సర్పంచుల సంఘం, జేఏసీ నాయకులు కోరుతున్నారు.

నేడు బీఆర్ఎస్ భేటీ

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణభవన్‌లో మధ్నాహ్నం రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సమావేశానికి హాజరుకానున్నారు. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణతోపాటు సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం తదితర నిర్మాణాత్మక అంశాలపై విస్తృతస్థాయిలో చర్చించనున్నట్టు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే ప్రకటించారు. ఈ నెలాఖరులో బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ నాయకత్వం మొదట నిర్ణయించింది. అయితే, బహిరంగసభను ఈ నెలలో నిర్వహించడం కన్నా పార్టీ ఆవిర్భావ దినోత్సవంనాడు నిర్వహించాలా? లేదా పార్టీ అధ్యక్ష ఎన్నిక ఉన్న సెప్టెంబర్/అక్టోబర్‌లో నిర్వహించాలా? అనే అంశంపై చర్చించనున్నట్టు సమాచారం. ఏప్రిల్ 27న ప్రతినిధుల సభను నిర్వహించి, అప్పటినుంచి అధ్యక్ష ఎన్నిక నాటికి పార్టీ సభ్యత్వ నమోదు, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి దాకా పార్టీ ప్రధాన కమిటీలు, అనుబంధ కమిటీల ఎన్నికల నిర్వహణ, సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో అధ్యక్ష ఎన్నిక నిర్వహణ తదితర అంశాలపై లోతుగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణ, అనుసరించే వ్యూహంపై పార్టీ శ్రేణులకు అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

రజతోత్సవ ప్రయాణంలో....

తెలంగాణ కోసమే ఆర్భవించిన నాటి టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్ తన సుదీర్ఘ ప్రయాణంలో నాలుగు కోట్ల ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నది. 14 ఏండ్లు పోరాటం చేసి, అనేక ఉద్యమాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలతో పేగుబంధాన్ని పెనవేసుకున్నది. 'తెలంగాణ సంతోషమే బీఆర్ఎస్ సంతోషం. తెలంగాణ బాధే బీఆర్ఎస్ బాధ'గా కొనసాగుతున్న సందర్భంలో ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలకు ప్రాధాన్యం నెలకొన్నది. తెలంగాణ సాధనలో ఉద్యమ మరపురాని అనుభూతులను ఈ తరానికి చేరవేయడం, తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం బీఆర్ఎస్ తన పదేండ్ల పరిపాలనలో అటు అభివృద్ధిలో, ఇటు ప్రజా సంక్షేమంలో చెరగని సంతకం చేసిన కేసీఆర్ ఖ్యాతిని ప్రతి ఒక్కరికీ చేరేలా కార్యాచరణ రూపొందించుకోవాలని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. తెలంగాణ కోసం ఒక్కడిగా బయలుదేరిన కేసీఆర్ వెంట 60 లక్షల సుశిక్షితులైన సైన్యం ఉన్నది. ఆ సైన్యం గర్జన ఏ స్థాయిలో ఉంటుందో 14 ఏండ్ల ఉద్యమ ప్రస్థానంలో చవిచూసినట్టే ఏడాది కాలంగా కాంగ్రెస్ చవిచూస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో తెలంగాణ అతలాకుతలం అవుతున్నది. కేసీఆర్ నాయకత్వాన్ని జారవిడచుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రగతి పట్టాలు తప్పి కకావికలం అవుతున్న సందర్భం నెలకొన్నది. రైతులు, మహిళలు, వృద్ధులు, పారిశ్రామికవేత్తలు, ఐటీ రంగం, కార్మికులు ఇలా సబ్బండ వర్గాలు మళ్లీ బీఆర్ఎస్ గొడుగు కోసం ఎదురుచూస్తున్న వాతావరణం నెలకొన్నది. ఇటువంటి తరుణంలో కేసీఆర్ 'ఏం చెప్తారు?' అని ప్రజల్లో ఆసక్తి నెలకొనగా, రాజకీయ నాయకులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై...

రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల మీద నేటి విస్తృతస్థాయి సమావేశంలో చర్చించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్రంగా చర్చించి పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం, కార్యకర్తలు, శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలు, విధానాలపై ఈ సమావేశంలో కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

సర్కార్ విధానాలపై అలుపెరగని పోరు

రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయాలన్నీ బూమరాంగ్ అవుతున్నాయి. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామనే వేలంవెర్రి వ్యూహంతో కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రజావ్యతిరేకతను చవిచూస్తున్నది. రేవంత్ సర్కార్ వేస్తున్న తప్పటడుగులు యావత్ తెలంగాణ భవితకు, ప్రతిష్ఠకు గొడ్డలిపెట్టుగా మారుతున్నాయి. రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ ఎక్కడికక్కడ ఎండగట్టడంలో, నిలువరించడంలో అనేక విజయాలను సాధించింది. రైతు రుణమాఫీని సాధించటంలో (ఇంకా పూర్తిస్థాయిలో రైతులందరికీ మాఫీ కాకపోయినా), రైతుభరోసా కనీసంగానైనా మొదలుపెట్టడంలో, నేలవిడిచి సాముచేస్తున్న హైడ్రాకు ముకుతాడు వేయడంలో, అమాయక గిరిజన రైతుల భూములను లాక్కోని సర్కార్ సృష్టించిన లగచర్ల అరాచకాన్ని నిలువరించడంలో, ఢిల్లీ దాకా వెళ్లి లగచర్ల విషయంలో సర్కార్ వైఖరిని ఎండగట్టడంలో, గురుకుల విద్యార్థుల డైట్‌చార్జీల పెంపు.. ఇలా అనేక విషయాల్లో రేవంత్ సర్కార్‌ను బీఆర్ఎస్ భూమార్గం పట్టించింది. ఆఖరికి బీసీ కులగణన విషయంలోనూ కాంగ్రెస్ సర్కార్ రీసర్వే (సర్వేలో భాగం కానివారిని చేస్తామని) ప్రకటించేదాకా నిత్యం ప్రజల్లోనే ఉంటూ తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ రాజీలేనిపోరాటం చేస్తున్నది. బీఆర్ఎస్ అంటే తెలంగాణ ఇంటిపార్టీ.. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణ గుండెచప్పుడు గులాబీదండు అని గడచిన ఈ 14 నెలల కాలంగా నిరూపితం అవుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, భవిష్యత్తు కార్యాచరణపై పార్టీ అధినేత కేసీఆర్ గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

14 నెలల కాంగ్రెస్ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై బీఆర్ఎస్ సాధించిన విజయాలకు మచ్చుతునకలు

- రూ.2 లక్షల రైతు రుణమాఫీని (ఇంకా పూర్తిస్థాయిలో రైతులందరికీ పూర్తి మాఫీ కాకపోయినా) అమలు చేయక తప్పని అనివార్యతను బీఆర్ఎస్ సృష్టించింది.
- రైతుభరోసాను ప్రభుత్వం మొదలు పెట్టేలా చేసింది.
- హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ అండగా నిలవటంతో ముచ్చెమటలు పట్టి ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలోకి సర్కార్ వెళ్లింది.
- లగచర్ల భూ నిర్వాసితుల పట్ల రేవంత్ సర్కార్ విధానాలను ఎండగట్టేందుకు గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరుబాట. బాధితులకు అండగా నిలిచేందుకు జాతీయ మానవహక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ దాకా వెళ్లి రేవంత్ సర్కార్ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై అలుపెరుగని పోరాటం.
- గురుకులాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలతో విద్యార్థుల అస్వస్థతకు గురికావడం, కొన్ని ప్రాంతాల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై బీఆర్ఎస్ చేపట్టిన 'గురుకులబాట'తో సర్కార్ దిగొచ్చి మెస్‌చార్జీలను పెంచటం.
- రైతు ఆత్మహత్యలపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ, గురుకులాల దుస్థితిపై ఆర్ఎస్ ప్రవీణ్ నేతృత్వంలో కమిటీ, గాంధీ దవాఖాన సహా రాష్ట్రంలోని ఆధ్వాన్న వైద్య స్థితిగతులపై మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ టీ రాజయ్య సారధ్యంలో కమిటీ, ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలప